ఆగని గజ దాడులు

ఏనుగులు ధ్వంసం చేసిన పంటను చూపుతున్న రైతు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఏనుగులు సరిహద్దుల్లో సంచరిస్తూ పంటలపై దాడులు చేస్తున్నా అధికారలు పట్టించుకోలేదని పలువురు రైతులు వాపోయారు. శుక్రవారం వేకుజామున మండలంలోని బోడబండ్ల గ్రామంలో మంజు, వెంకటేష్, మురళి, హరిలకు సంబంధించిన మామిడి, కొబ్బరి, అరటి చెట్లు ను ఏనుగులు ధ్వంసం చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. దీంతో భారీగా నష్టపోయినట్టు రైతులు తెలిపారు. ఏనుగుల నియంత్రణ కోసం ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టకపోవడం వలన ఏనుగులు తరచూ పంట పొలాలపై సంచరిస్తున్నాయని ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ఏనుగుల నియంత్రించాలన్నారు

నమ్మినందుకు...నడిరోడ్డుపై..!

- అంగన్‌వాడీల రాస్తారోకోలు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్, యంత్రాంగం: వేతనాలు పెంపు, గ్రాట్యూటి అమలు చేసేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అంగన్వాడీ యూనియన్స్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సుజిని, బుజ్జి, సిఐటియు జిల్లా అధ్యక్షులు, చైతన్య, ఏఐటియుసి నాయకులు కే.ప్రభావతి, కే .అరుణ నాయకత్వం వహించారు. ప్రాజెక్టు కార్యాలయం ముందు రాస్తారోకో నిర్వహించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని నాలుగున్నర సంవత్సరాల నుండి అనేక పర్యాయములు సంబంధిత అధికారులకు, మంత్రివర్యులకు తెలియజేసినప్పటికీ నేటికి వేతనాలు పెంచలేదని విమర్శించారు. చింతా ప్రతాప రెడ్డి నోటికి వచ్చిన విధంగా అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. జిజెఎం ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధి గురజాల చెన్నకేశవనాయుడు, టిడిపి నాయకులు సప్తగిరి ప్రసాద్‌లు మద్దతు తెలిపారు.

- వి.కోట ఎంఆర్‌ఓ కార్యాలయంఎదుట ప్రధాన రహదారిపై అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అధికారం చేపట్టిన తర్వాత గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు.ప్రభుత్వం దౌర్జన్యంగా అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టడం అంటే అంగన్వాడి సిబ్బంది గుండెలను పగలగొట్టినట్లుగా భావిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు.
- కార్వేటినగరం కూడలిలో ప్రాజెక్టు నాయకులు మమత, రాధమ్మ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య సంఘీభావం ప్రకటించారు. అంగన్‌వాడీలు చెంచులక్ష్మి, లక్ష్మినరసమ్మ, మంజుల, యువరాణి, ఉమ, సౌదామి పాల్గొన్నారు.
- శాంతిపురంలో జాతీయరహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

కార్వేటినగరం కూడలిలో

వి.కోట ఎంఆర్ఓ కార్యాలయంఎదుట

యువగళం ముగింపు యాత్ర సక్సెస్

పూతలపట్టు ఇన్‌చార్జి మురళిమోహన్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మురళీమోహన్

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: యువగళం పాదయాత్ర ముగింపు సభ కనివిని ఎరుగని రీతిలో విజయవంతమైందని, వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం ఖాయమని పూతలపట్టు ఇన్‌చార్జి మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా నుండీ ప్రారంభమైన పాదయాత్ర ముగింపు సభలో జిల్లానుండీ పెద్ద సంఖ్యలో టిడిపిశ్రేణులు పాల్గొన్నాయన్నారు. పాదయాత్రలో ఆయనకు ఎదురైన సమస్యలను ప్రజలు యువకులు ఆయన దష్టికి తెచ్చిన సమస్యలను ప్రతి జిల్లాను ఉచ్చరిస్తూ ప్రతి సంఘటనను గుర్తు చేసుకుంటూ ముగింపు సభలో ఆయన ప్రసంగించిన తీరు రాజకీయ ఉద్దండులను సైతం ఆలోచింపజేసిందని, టిడిపి జనసేన కలయికతో రాష్ట్రంలో టిడిపి జనసేన ఉమ్మడి ప్రభుత్వం రానున్నట్లు తెలిపారు. డబ్బున్న వాళ్ళే రాజకీయాల్లో టికెట్లు పొందే ఈ తరుణంలో అంబేద్కర్ ఆశయాలకు ఊపిరి పోసిన నాయకుడు చంద్రబాబు నాయుడు ఓ నిరుపేద కుటుంబంలో పుట్టిన తనకు పూతలపట్టు బాధ్యత ఇచ్చారన్నారు.

బాలుడి మృతదేహంతో

రహదారిపై బైఠాయింపు

- అధికారుల నిర్లక్ష్యం.. విద్యుదాఘాతంతో బాలుడు మృతి
- 11 కేవీ లైన్ తగిలి మృత్యువాత
- సమస్యపై రెండురోజులుగా చెబుతున్నా పట్టించుకోని అధికారులు
- అధికారులపై చర్యలు తీసుకొని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళిమోహన్ డిమాండ్

ప్రజాశక్తి-యాదమరి:

విద్యుత్ తీగలు బాలుడి నిండు ప్రాణాలు బలిగొన్నాయి. అధికారుల నిర్లక్ష్య వైఖరితో బాలుడు మృతి చెందాడంటూ గ్రామస్తులు ఆందోళనకు దిగిన సంఘటన యాదమరి మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రెండు రోజుల ముందు యాదమరి మండలం ఈనాటంపల్లిలో 11కేవీ విద్యుత్ తీగలు నెలకొరిగాయి. దీనిపై స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. గ్రామానికి చెందిన బాలుడు అభి(15) బహిర్భూమికని అటుగా వెళ్లి 11కేవీ విద్యుత్ తీగలకు తగిలి మృత్యువాతపడ్డారు. బాలుడు మృతి పట్ల గ్రామస్తులు అధికారులపై ఆగ్రహ ఆవేశంతో రగిలిపోయారు. విద్యుత్ తీగలు నేలకొరిగిన విషయాన్ని చెప్పినా పట్టించుకోలేదంటూ మండిపడ్డారు. బాలుడు మృతదేహం తీసుకొని శుక్రవారం చిత్తూరు-గుడియాత్తం అంతరాష్ట్ర రహదారి (జోడిచింతల సబ్‌స్టేషన్) వద్దకు తీసుకెళ్లి రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. జరిగిన సంఘటనను పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళిమోహన్‌కు తెలియజేయడంతో అక్కడికి చేరుకన్న మురళిమోహన్ అధికారుల తీరును తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్కడి వచ్చిన విద్యుత్ శాఖ డీఈ హరి బాధిత కుటుంబానికి రూ.5లక్షలు ఎక్స్ గ్రేషియో ఇస్తామని, తల్లికి లేదా మృతుడి అన్నకి ప్రభుత్వ ఉద్యోగం, మూడు ఎకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న గ్రామస్తులు, నాయకులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో.. స్తంభించిన విద్యావ్యవస్థ

ప్రజాశక్తి - పుంగనూరు:

విద్యావ్యవస్థలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులందరూ గత మూడు రోజులుగా సమ్మెబాట పట్టడంతో ఎక్కడెక్కడ విద్యా కార్యక్రమాలు అన్నీ స్తంభించాయి. నాడు నేడు కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయి. స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ కార్యక్రమాలు నిలిచిపోయాయి. బైజూస్ ట్యాబ్ ఈ పాఠాలు అన్ని నిలిచిపోయాయి. ముఖ్యమంత్రివర్యులు పుట్టినరోజు సందర్భంగా పంపిణీ చేసిన ట్యాబులు కూడా రాష్ట్రవ్యాప్తంగా సక్రమంగా సరఫరా కాలేదు. వీరు లేని కారణంగా బైజుస్ ట్యాబ్ నందు విద్యా కార్యక్రమాలు అప్లోడ్ చేసే పరిస్థితి ఎక్కడ లేదు కాబట్టి బై జూస్ కంటెంట్ పూర్తిగా నిలిచిపోయినది. అలాగే ఇంటర్ ఆక్టివ్ ప్లాట్ ప్యానల్ ఐఎఫ్పి విద్యా కార్యక్రమాలు పూర్తిగా పంపించడం జరిగింది. నెలలో చివరి పని దినాలు కావున జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజనం సంబంధించిన కార్యక్రమాలు ,ఆయాల జీతాలు ,మధ్యాహ్న భోజన కార్మికుల జీతాలు మండల స్థాయిలో కంప్యూటర్ నందు అప్లోడ్ చేయవలెను ఇవి చేయకపోతే వారి నెలల జీతాలు కూడా పడే పరిస్థితులు కనబడడం లేదు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యము, చిక్కిలు, కోడిగుడ్లు తదితర పూర్తి వివరాలు కూడా లేక సరఫరా కావని తెలుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా స్థాయి సైన్స్ డే కార్యక్రమాలు కూడా నిలిచిపోయే పరిస్థితి కనబడుతున్నది. మండల విద్యాశాఖ కార్యాలయాలు తెరుచుకోక మెసెంజర్ లేక అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో మండల విద్యాశాఖాధికారులు చెప్పుకోలేక దిక్కులేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. అలాగే సహిత విద్య కార్యాలయంలో ఐ.ఆర్.సిలుగా పనిచేస్తున్న టీచర్లు సమ్మెబాట పట్టడంతో మానసిక వైకల్యం కలిగిన పిల్లలను పూర్తిగా ప్రభుత్వం స్తంభింపజేసింది . గ్రామస్థాయిలో పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాలు రాష్ట్ర స్థాయికి పంపడానికి సిఆర్పిలు, మండల కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు లేకపోవడంతో డేటా మొత్తం పూర్తిగా నిలిచిపోయింది .దీనితో రాష్ట్ర అధికారులపై కేంద్ర విద్యా శాఖ వర్గాలు తీవ్ర అసంతప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. సమగ్ర శిక్ష ఉద్యోగులకు రాష్ట్రస్థాయిలో ఫ్యాప్టో, కార్మిక సంఘాలు సిఐటియు ,ఏఐటీయూసి ,సిపిఎం ,సిపిఐ ,యుటిఎఫ్ ,ఎస్ టి యు, ఏపీ టిఎఫ్, 18 ఉపాధ్యాయ సంఘాల నాయకులు రాష్ట్రస్థాయి నుంచి వీరికి అండగా నిలవడం చర్చనీయాంశం. చిరు ఉద్యోగులైన వీరి బాధలో పట్టించుకోక కనీసం చర్చలకు కూడా పిలవక పోవడం ప్రభుత్వ స్థితి ఏంటని మేధావులు ఆలోచిస్తున్నారు. సమగ్ర శిక్ష కార్యక్రమాలు చేయడానికి విద్యా శాఖ వర్గాలను పంపుతున్నట్లు ప్రభుత్వం చెప్పిన ఉపాధ్యాయ సంఘాలు ఎవరూ అంగీకరించలేదు. అలాగే వీరి కోసం ఉపాధ్యాయ సంఘాలు అందరూ ప్రత్యక్ష సమ్మెకు పిలుపునిచ్చాయి. సమ్మె ఇలాగే కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు ,ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు ఏకతాటపైకి వస్తే రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని నిఘా వర్గాలు తెలుపుతున్నాయి. నిఘా వర్గాల ద్వారా కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖకు సంబంధించిన వర్గాలు నిశితంగా పరిశీలించి రాష్ట్రానికి రావలసిన వాటా పై కూడా దెబ్బ పడుతుందని నిపుణులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి రావలసిన మౌలిక వసతుల నిధులు కూడా రావాలంటే యుడైస్ కార్యక్రమాలు కేంద్రానికి సమర్పించవలసి ఉంది. ఇవి కూడా పూర్తిగా స్తంభించడంతో భవిష్యత్ విద్యా కార్యక్రమాలు ఏ విధంగా కొనసాగుతాయో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం కన్ను తెరిచి వీరితో చర్చలు జరిపి విద్యా కార్యక్రమాలు సాఫీగా జరగడానికి సహకరించాలని కోరుతున్నారు . వీరి ప్రధాన డిమాండ్స్... ఉద్యోగ భద్రత కల్పించాలి, గత ఐదు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదు, రవాణా బత్యం ఇంటి అద్దె చెల్లించాలి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరుతున్నారు.

మోకాళ్ళపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

మోకాళ్లపై నిరసన

చిత్తూరుఅర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం కి మూడో రోజుకు చేరింది. చిత్తూరు కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తూ అనంతరం వారిని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెలవులు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయించుకోవడం దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్ట్ టైం పేరు తోఫుల్ టైం చేపించుకోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే సురేంద్రన్, సర్వ శిక్ష అభియాన్ జేఏసీ నాయకులు శ్రీనివాసులు, వేలాయుధం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు కుర్చీలకివ్వాల్సిందేనా.?

- జక్కిదొనలో ఉద్యోగులు లేక ఖాళీగా కుర్చీలు
- సచివాలయ ఉద్యోగుల తీరు పట్ల విమర్శలు
- ప్రజలకు తప్పని నిరాశ

సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ప్రజా ముంగిటికి ప్రభుత్వ సేవలు అందించాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను రూపొందించింది. వివిధ శాఖలను విభజించి సిబ్బందిని నియమించింది. ఉద్దేశం మంచిదైనా సిబ్బంది నిర్లక్ష్య దోరణి పలువురి విమర్శలకు దారితీస్తోంది. సిబ్బంది గైర్హాజరు, పనిలో అలసత్వం, పని వేళల్లో అందుబాటులో లేకపోవడం వంటి సంఘటనలకు విమర్శకుల వాదనకు బలం చేకూరుస్తోంది. గంగాధం నెల్లూరు నియోజ కవర్గం వెదురుకుప్పం మండలం జక్కిదొన సచివాల యంలో శుక్రవారం సిబ్బంది రాక ఖాళీ కుర్చీలు దర్శ నమిచ్చాయి. గంటావారిపల్లి, జక్కిదొన గ్రామాలకు కలిపి ఈ సచివాలయం ఏర్పాటైంది. అర్జీలతో సచివా లయాన్ని సందర్శించిన గ్రామస్తులకు ఖాళీ కుర్చీలు కనిపించడంతో ఇదేం తీరు.. అంటూ అసహనానికి లోనై విమర్శలు గుప్పించారు. వ్యవసాయ పనులు, దినసరి కూలీలు పని మానుకొని ప్రభుత్వ పథకాలు, వివిధ సర్టిఫికేట్‌లు పొందడానికి అర్జీలు తెచ్చినా వా రకి నిరాశ తప్పలేదు. సిబ్బంది ఒక్కరు కూడా సచివాలయంలో లేకపోవడంతో ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల ఆకస్మిక తనిఖీలు ఆర్భాటాలకే తప్ప గ్రామ పరిపాలనను గాడి పెట్టేందుకు ఉపయోగ పడలేదంటూ గ్రామస్తులు వాపోయారు. తెచ్చిన అర్జీలు కుర్చీలకు ఇవ్వాల్సిందేనా అంటూ మండిపడ్డారు.

మహిళా పోలీస్ మాత్రమే విధుల్లో ఉన్నారు..

సిబ్బంది సచివాలయంలో లేని మాట వాస్తవమే. సిబ్బంది వివిధ కారణాలతో సెలవులో ఉన్నారు. ప్రస్తుతం మహిళా పోలీస్ మాత్రమే అక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో భోజనానికి వెళ్లి ఉండోచ్చు.

- ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో, వెదురుకుప్పం

ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా..?

వామపక్షాల నిరసన

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: అత్యున్నత సభ పార్లమెంటు లో సభ జరుగుతుండగానే దుండగులు ప్రవేశించి పొగ బాంబు వేసి భయభ్రాంతులను చేసిన సంఘటనను సమావేశంలో చర్చించి హెూం మంత్రి అమిత్ షాను, ప్రధానమంత్రి మోడీని ప్రశ్నించినందుకు ఇండియా వేదిక విపక్ష పార్టీల ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం కట్టమంచి చెరువు స్వామి వివేకానంద విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పోటుగారి భాస్కర్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, సిపిఎం నాయకులు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రజా సమస్యలపైనా, పార్లమెంట్ భద్రతపైనా ప్రశ్నించినందుకు ఎంపిలను సస్పెండ్ చేశారన్నారు. దేశంలోనే అత్యంత ఉన్నత సభను రక్షించలేని బిజెపి ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలన్నారు. హెూం మంత్రి అమీత్ షా ,ప్రధానమంత్రి మోడీ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు . విపక్ష పార్టీలకు సంబంధించిన 146 ఎంపీలను సస్పెండ్ చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. ఇండియా వేదిక విపక్ష పార్టీల 146 ఎంపీ ల అక్రమ సస్పెండ్ ను వెంటనే ఎత్తివేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవర్ధన రెడ్డి ,అర్ ఆర్ బాబు, కే నారాయణస్వామి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఇండియా కూటమి నాయకులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

తనిఖీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు పెద్ద హరిజనవాడ, చవటపల్లి ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలను తనిఖీ చేశారు. వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహిస్తే దోమలు పుట్టవని తెలిపారు. తద్వారా దోమకాటు ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ రాదన్నారు.

2 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ

- క్రానిక్ వ్యాధులపట్ల జాగ్రత్త వహించాలి
- ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ కార్యక్రమాన్ని జనవరి 2వ తేదీ నుంచి నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఫ్యామిలీ వెల్ఫేర్ జె.నివాస్ అన్నారు. శుక్రవారం విజయవాడ నుంచి కమిషనర్ విడియో కాన్ఫరెన్స్ ద్వారా జిలా అధికారులతో సమీక్షించారు. సురక్ష కార్యక్రమానికి సంబంధించి గ్రామ సచివాలయం, వార్డు సచివాలయాల నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలని దీర్ఘకాలిక వ్యాధులు, అందత్వ నివారణకు సంబంధించిన వ్యాధులు, క్షయ వ్యాధికి సంబంధించిన వ్యాధులపై దృష్టి పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ప్రభావతిదేవి, జిల్లా అందత్వ నివారణ అధికారిణి డాక్టర్ అర్పిత, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, డిఎంఓ శ్రీనివాసన్, డాక్టర్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ నూతన కార్డుల పంపిణీ కార్యక్రమం వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

ఎపిక్ కార్డుల పంపిణీపై దృష్టి పెట్టండి : ఇన్‌ఛార్జ్ కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

ఓటర్ల నమోదు ప్రక్రియలో చిత్తూరు జిల్లా యంత్రాంగం పనితీరు అభినందనీయమని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ డాక్టర్ పోలా భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ-2024పై జిల్లా ఇన్చార్జి కలెక్టర్ శ్రీనివాసులు, డిఆర్‌వో రాజశేఖర్‌లతో కలసి ఏఈఆర్‌ఓలు, తహశీల్దార్లు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. డాక్టర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ ఓటర్ల నమోదు ప్రక్రియలో చిత్తూరు జిల్లాలో స్వీప్ ఆక్టివిటీస్‌ని ముమ్మరంగా నిర్వహించి 19,448 మంది నూతనంగా నమోదు చేయడం అభినందనీయమన్నారు. డిసెంబర్ 9 వరకు అందిన క్లైయిమ్‌లు అన్నింటిని పరిష్కరించాలని, ఎపిక్ కార్డుల ముద్రణ ప్రక్రియ, పంపిణీ వేగవంతం చేసి ఓటరుకు అందజేయాలన్నారు. ఎపిక్ కార్డ్‌లో ఫోటోలు క్లారిటీగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి ఈఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, తహశీల్దార్లు, బిఎల్‌ఓలు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలన్నారు. రాజకీయపార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తిచేస్తూ అభ్యర్థనలను పరిష్కరిస్తామన్నారు. ఇన్‌ఛార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలోని 7 నియోజక వర్గాలలో మొత్తం 15,45,666 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో 7,63,671 మంది పురుషులు, 7,81,887 మంది స్త్రీ ఓటర్లు, 108 మంది ట్రాన్స్ జెండర్లు, 3,486 మంది సర్విస్ ఓటర్లు ఉన్నారని, 1,762 పోలింగ్ స్టేషన్‌లకు 1,762 బిఎల్‌ఓలను, ప్రతి 10 పోలింగ్ స్టేషన్ లకు ఒకరు చొప్పున 176 సూపర్ వైజర్‌లను నియమించడం జరిగిందన్నారు. ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా చేసి 05 జనవరి 2024న తప్పులు లేని తుది జాబితాను విడుదల చేయడానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో చిత్తూరు, నగరి, పలమనేరు ఆర్డీవోలు చిన్నయ్య, సుజన, మనోజ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటి కలెక్టర్ భవానీ, టీడీపీ నాయకులు గౌనివాని శ్రీనివాసులు, కోదండయ్య, కాంగ్రెస్ నాయకులు పరదేశి, సీపీఎం ప్రతినిధి గంగరాజు, బిజెపి నాయకులు జగదీశ్వరనాయుడు, అట్లూరి శ్రీనివాసులు, బిఎస్‌పి నాయకులు భాస్కర్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న పోలా భాస్కర్

సిబ్బందితో మాట్లాడుతున్న అబ్జర్వర్ పోలా భాస్కం

ఓటరు నమోదులో నిర్లక్ష్యం తగదు

చిత్తూరుఅర్బన్:

ఓటరు నమోదులో బిఎల్‌వోలకు నిర్లక్ష్యం తగదని జిల్లా ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ డాక్టర్ పోలా భాస్కర్ తెలిపారు. శుక్రవారం పూతలపట్టు మండల కేంద్రంలోని పోలింగ్‌బూత్‌ని జిల్లా ఇంఛార్జి కలెక్టర్ శ్రీనివాసులుతో కలసి సందర్శించారు. బూత్ లెవల్ అఫిసర్లతో మాట్లాడుతూ ఫారం 6, 7, 8, 9 నమోదులో మార్పులు, చేర్పులు సరిచూసుకోవాలని సూచించారు. మార్పులు చేర్పులు, తొలగింపులకు సంబంధించి రికార్డులను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, ఈఆర్వో శివయ్య, తహశీల్దార్ విజయభాస్కర్, ఎంపిడిఓ గౌరి, బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పరిశీలన

చిత్తూరుఅర్బన్:

కొత్త ఓటర్ల నమోదు ఎలా చేశారు.. దరఖాస్తులు చూపించండి... నిర్దేశించిన చెక్ లిస్ట్ ప్రకారం దరఖాస్తులు స్వీకరించారా..! క్లైములు పరిష్కారం కోసం డోర్ టు డోర్ వెరిఫికేషన్ ఏలా చేశారు.. అంటూ జిల్లా ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ డాక్టర్ పోలా భాస్కర్ బిఎల్వోలను ప్రశ్నించారు. శుక్రవారం ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌తో కలసి నగరపాలక సంస్థ పరిధిలో కట్టమంచి నగరపాలక పాఠశాలలో 18, 19 పోలింగ్ కేంద్రాల్లో తనిఖీ చేశారు. నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన స్వీప్ కార్యక్రమాలపై రోల్ అబ్జర్వర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఆర్వో, ఆర్డీవో చిన్నయ్య, సహాయ కమిషనర్ గోవర్ధన్, సీఎంఎం గోపి, తహశీల్దార్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎస్ఆర్ పురం మండల మీట్

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' ను విజయవంతం చేయండి: ఎంపీడీవో

సమీక్షిస్తున్న ఎంపీడీవో

ప్రజాశక్తి-సోమల: ఈ నెల 26వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా కార్యక్రమాలను మండలంలో ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని ఎంపీడీవో నాగరాజు కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంఈఓ పంచాయతీ కార్యదర్శులు వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ శనివారం 23వ తేదీ ఆయా పంచాయతీల పరిధిలో పంచాయతీ కేంద్రంలో ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి లక్ష్మీదేవి, ఎంఈఓ శివరత్నమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దళితుల హక్కుల సాధనకు కృషి చేసిన

మానవతావాది పివి రావు

నివాళులర్పిస్తున్న నాయకలు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దళితుల హక్కుల సాధనకు వారి తరపున పోరాటం చేసిన యోధుడు మానవతావాది పి.వి రావు అని మండల మాల మహానాడు అధ్యక్షులు టిఎం మంజునాథ్ అన్నారు. శుక్రవారం పివి రావు వర్ధంతి సందర్భంగా మండలంలోని ప్రజాసంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి పివి రావుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్లను పొందుపరిచిన వాటిని అమలుపరిచేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాల మహానాడు సంఘాన్ని స్థాపించి, మండల స్థాయి వరకు సంఘాలను ఏర్పాటు చేసి, ఆ సంఘం ద్వారా దళితుల హక్కుల సాధనకు, రిజర్వేషన్ల అమలుకు పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి పివి రావు అని అన్నారు. అదేవిధంగా గతంలో రిజర్వేషన్లు కొంత పరిధి వరకు ఉండేవని మండల స్థాయిలో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని పోరాటం చేశారని ఆయన వర్ధంతి సందర్భంగా ఆయన్ని స్మరించుకోవడం సంతోష తగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాల మహానాడు మండల అధ్యక్షులు టి.ఎమ్. మంజునాథ్,జిల్లా కార్యదర్శి తిప్పయ్య, రంగప్ప, జయప్ప తదితరులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

సామాజిక తనిఖీలో నిబద్ధత ఉండాలి

- ఉపాధిహామీ పీడీ గంగాభవాని

సామాజిక తనిఖీ సభ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: సామాజిక తనిఖీలో సిబ్బంది నిబద్ధతగా వ్యవహరించాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ సమావేశంలో పీడీ మాట్లాడుతూ సామాజిక తనిఖీ చేసేందుకు వచ్చే సిబ్బంది క్షేత్ర స్థాయిలో చేపట్టిన పనులను క్షుణ్ణంగా పరిశీలించి అవకతవకలను గుర్తించాలని తెలిపారు. అనంతరం మండలంలో 1352 పనులకు రూ.9కోట్లు వెచ్చించినట్లు పేర్కొన్నారు. అందులో మొక్కలు నాటేందుకు, భవన నిర్మాణానికి, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.ఒకకోటి 92 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. ఉపాధిహామీ పనులపై చేపట్టిన సామాజి తనిఖీలో అవకతవకలు జరిగినట్లు తనిఖీ సిబ్బంది తెలపడంతో రికవరీ కింద రూ.6972 వసూలు చేసినట్లు చెప్పారు. ఉపాధి హామీపనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, ఏపీడీ శోభన్బాబు, ఎంపిపి లతబాలాజీ , ఎంపీడివొ మోహన్ మురళీ, ఏపీవా జాహ్నవి, పలువురు డీఆర్పీలు, ఎస్ఆర్పీలు, పీల్డు అసిస్టెంట్లు పలువురు పాల్గొన్నారు.

గంగమ్మకు హారతి

పూజలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: హంద్రీనీవా కాలవ ద్వారా బైరెడ్డిపల్లి మండలానికి చేరిన గంగాదేవికి పూజల నిర్వహిన వివరాలు మండల పరిధిలోని కామ దొడ్డి గంగమ్మగుడి సమీపాన హంద్రీనీవా కాలువ ద్వారా ప్రవహిస్తున్న గంగ దేవికి డిసిసి బ్యాంక్ చైర్మన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి ఎంపిపి మొగసాల రెడ్డప్ప, గంగమ్మకు సారె గంగాదేవికి పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి. ప్రవేశపెట్టిన హంద్రీనీవా కాలువ ద్వారా ప్రజలకు సాగునీరు తాగునీరు అందించాలని కోణంలో ఆయన ప్రారంభించారు. కానీ టిడిపి ప్రభుత్వంలో అది చేయలేకపోయారు ప్రస్తుతం ఆయన కుమారుడు కంద్రికాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి రైతు, ప్రజలు తాగునీరు సాగునీరు పుష్కరంగా ఉండేందుకు కుప్పం వరకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఇప్పుడు నెరవేరడం ఎంతో సంతోషకరమని అదే విధంగా జగన్మోహన్ రెడ్డి చెప్పిందే చేశాడని ప్రజలందరూ గమనించి ఆయనే ఆయన్ని మరోమారు గెలిపించి ఆయన ప్రవేశపెట్టిన పథకాలన్నీ మళ్ళీ అమల్లో ఉండేలా చూడాలని అక్కడికి వచ్చిన ప్రజలను ఆమె కోరారు. కార్యక్రమంలో నాయకులు రూపకుమార్. నారాయణస్వామి సర్పంచ్లు ఎంపిటిసీలు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

చౌడేపల్లిలో

బంగారుపాళ్యంలో

గంగాధర నెల్లూరులో

ప్రజాశక్తి-చౌడేపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు లెక్కల మాంత్రికుడు శ్రీ రామానుజన్ జయంతి పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామానుజన్ జీవిత చరిత్రను ఉపాధ్యాయులు పిల్లలకు వివరించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన పలు నమూనాలు క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు నాగరాజరెడ్డి, సోమశేఖర్, సాహెబ్, కళ్యాణ భారతి, మురళి, దేవదానం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: జిల్లా విద్యా శిక్షణ సంస్థ కార్వేటినగరంలో శుక్రవారం గణిత విద్యావేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదిన పురస్కరించుకొని గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించరు. ఇందులో మొదటగా బోధనోపకరణల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గణిత అధ్యాపకులు అనిత ఆధ్వర్యంలో పిల్లల యొక్క భాగస్వామ్యంతో ప్రదర్శించారు. బోధనోపకరణల ప్రదర్శనలో విజేతులకి డైట్ వైస్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం బహుమతులు ప్రదానం చేశారు. అదే విధంగా డిఎం పురం ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్య, అధ్యాపక బృందం అనిత, దేవప్రసాద్, సునీత, నిర్మల, రెడ్డి వెంకటరమణ, నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

పెద్దపంజాణి: గణిత మేధావి రామానుజన్ జయంతిని తులసమ్మ గుడి, నాగిరెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాబురెడ్డి, ఉపాధ్యాయులు మాధవన్, గంగాధర్, రాజేష్‌బాబు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం ఘనంగా జరిగింది. శనివారం కళాశాల ఐక్యూఏసీ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద కార్యక్రమాన్ని ప్రారంభించారు. గణిత శాఖ హెడ్ డాక్టర్ ఎస్.రుష్మా, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.ప్రభాకర్ రావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటేశు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సి.భరణీ నాథ్ రెడ్డి, డాక్టర్ చంద్రబాబు, డాక్టర్ మున్వర్, డాక్టర్ సి.మంగళ గౌరి తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మార్కులతో కాకుండా ప్రజ్ఞతో పాఠాలు నేర్చుకోవాలని ఎంఈవో రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని మంగళపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు హెచ్.అరుణ శివప్రసాద్, హెచ్ఎం ప్రభాకర్ పిల్లారప్పా, ప్రేమ కృష్ణ, సుధాకర్ మోహన్ రెడ్డి, సంజీవి, భారతి, అమర్నాథరెడ్డి, బాలయ్య, సంపంగి, ధనశేఖర్లు, రుషేంద్రపతి, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం: పరమహంస యోగానంద విద్యాలయంలో జాతీయ గణిత దినోత్సవాన్ని, రామానుజన్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్, ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, రాజ్‌కుమార్, దివాకర్, భవ్యశ్రీ, కవిత, బాలసుబ్రమణ్యం, నిహారిక, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

సదుం: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజం జయంతి సందర్భంగా సదుం జెడ్పి హైస్కూల్లో శుక్రవారం గణిత దినోత్సవం వేడుకలను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి, బహుమతులను అందజేశారు. హెచ్ఎం సుబ్రహ్మణ్యం, జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి యుగంధర్‌బాబు విద్యార్థులకు మాథ్స్ మ్యాజిక్స్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా యుగంధర్ బాబును హెచ్ఎం, గణిత ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

నగరి: రామానుజన్ జయంతి సందర్భంగా పట్టణంలోని నారాయణ పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. పాఠశాలలో శనివారంగణత ఎక్జిబిషన్ నిర్వహించారు. గణిత శాస్త్ర నమూనాలు, ఆకారాలతో విద్యార్థుల రంగవల్లులు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ఉపన్యాసం, ఎక్కములు, వ్యాసరచన, డ్రాయింగ్, మట్టితో గణిత ఆకృతుల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఏజీఎం ఈ కిషోర్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసి విద్యార్థులకు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్, ఏవో విజయ్, డీన్ యువరాణి, వైస్‌ప్రిన్సిపాల్ నాగరాజు, గాయత్రి, సాయిసోనియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని నంజంపేట జెడ్పి ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో పలువురు విద్యార్థులు గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని 70 మంది విద్యార్థులు గణిత నమూనాలను తయారు చేశారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, నాయకులు అమాస మోహన్, ప్రభాకర్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరుఅర్బన్: స్థానిక పీ ఈ ఎస్ పబ్లిక్ పాఠశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాలు అంబరాన్నంటాయి. భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని బాలగణిత మేధావులైన ఎనిమిదవ తరగతి చదువుతున్న యువన్ ప్రసన్న, భవజ్ఞలచే గణిత అష్టావధాన కార్యక్రమం జరిగింది. పచ్చకులు కురిపించిన ప్రశ్నల వర్షానికి ఏకధాటిగా బాల అవధానులైన యువన్ ప్రసన్న,భవిజ్ఞలు సమాధానాలు ఇచ్చి అందరిని అబ్బుర పరిచారు. వీరికి రాష్ట్ర ఉపాధ్యక్షులు, స్థానిక గణిత శిక్షకులు అరుణ శివప్రసాద్ శిక్షణ అందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో గణిత మేధావులైన ఆర్యభట్ట, బ్రహ్మగుప్త, మహావీరుడు, భాస్కర, శకుంతలా దేవి మొదలైన వారి వేషధారణలు ధరించి అద్భుత రీతిలో వారి గురించి వివరించారు. గణిత ఉపాధ్యాయుడు, పి ఇ ఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వై.వి.కష్ణ బాబు మాట్లాడుతూ అత్యంత వేగవంతమైన మానవ కంప్యూటర్ గా గిన్నిస్ రికార్డు సాధించిన శకుంతలా దేవి సేవ గణితంలో అనన్య సామాన్యమైందని కొనియాడారు.

సంసిధ్ క్యాంఫర్డ్ పాఠశాలలో...

స్థానిక గంగనపల్లి సంసిధ్ క్యాంఫర్డ్ పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు అనేక గణిత నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అరుణ్ కుమార్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

బందావన్ పాఠశాలలో...

స్థానిక సంతపేట నందుగల బందావన్ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నామని పాఠశాల కరస్పాండెంట్ శైలజ కుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ, ఢిల్లీ నందు రిటైర్డ్ ప్రొఫెసర్ గజేంద్ర నాయుడు, రిటైర్డ్ డైట్ సీనియర్ లెక్చరర్ మునిరత్నం విచ్చేశారు. పిల్లలందరూ గణితానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులను తయారుచేసి ప్రదర్శించారు. తరువాత విద్యార్థుల చేత అష్టావధాన ప్రక్రియను నిర్వహించారు. అవధానులుగా ఎనిమిదో తరగతి విద్యార్థిని పి. యశ , ఆరవ తరగతి విద్యార్థి జె హరి చరణ్ పాల్గొన్నారు. తరువాత పిల్లలు డ్రామా, పాటలు, నత్యాలు ప్రదర్శించి అందరిని ఆనందింపజేశారు.

గంగాధర నెల్లూరు:

మండలంలోని ఎట్టేరి శ్రీ భానోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ శ్రీ బానోదయ సిబిఎస్ఈ స్కూల్ ఆవరణలో శుక్రవారం గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం మ్యాక్స్ టీచర్లు శాలిని, సునీల్ ,వరలక్ష్మి ,సరళ, పవిత్ర ,రఫీ ఆధ్వర్యంలో విద్యార్థులు తయారుచేసిన గణిత నమూనాను కరస్పాండెంట్ ముదిపట్ల నాగేశ్వరరావు ప్రిన్సిపాల్ లావణ్య స్కూల్ ఇన్చార్జులు మనీ మేఘలై ,మౌనిక,లతో పాటు పలువురు టీచర్లు తిలకించారు. అలాగే గణితంలో విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పోటీలు నిర్వహించగా వారిలో గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలను టీచర్లతో కలిపి కరస్పాండెంట్ ప్రిన్సిపల్ పంపిణీ చేశారు.

పగలంతా వెలుగుతూ..

నిర్వహణా లోపం తలపిస్తూ

తూగుండ్రంలో పగటిపూట వెలుగుతున్న బల్బులు

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు : మండలంలోని వివిధ గ్రామాల్లో వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ బల్బులు నిరంతం వెలుతూనే ఉన్నాయి. సరియైన నిర్వహణ లేకపోవడంతో 24గంటలూ వెలుతూనే దర్శనమిస్తున్నారు. స్విచ్‌లు ఏర్పాటు చేయక పోవడం, మరికొన్ని చోట్ల డైరెక్ట్ కనెక్షన్ ఉండడంతో ఎల్ఈడీ బల్బులు వెలుతూనే ఉన్నాయంటూ స్థానికులు వాపోతున్నారు. నిర్వహణ లోపం వల్లే రాత్రింబవళ్ల వెలుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామాల్లో ప్రజలు కోరుతున్నారు.

క్రైస్తవ సోదరులకు

క్రిస్మస్ శుభాకాంక్షలు: జెసి. పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

యేసు ప్రభువు ఆశీస్సులు అందరి పై ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు.జిల్లా క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశం నందు డి ఆర్ ఓ .యన్. రాజశేఖర్,నగర పాలక సంస్థ మేయర్ ఆముదా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి చిన్నా రెడ్డి లతో కలసి ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఏసుక్రీస్తు మానవునిగా జన్మించి ప్రపంచ మానవాళి శాంతి సంతోషాల కోసం కరుణ, ప్రేమను అందరికి పంచాలన్నారు. యేసుక్రీస్తు చూపిన సత్యమార్గంలో ప్రతి ఒక్కరు పయనించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వము అనేక సంక్షేమ పథకాలు ఆములు చెస్తుందని వాటిని ఉపయోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పిల్లల చదువుకు ఉపకార వేతనాలు ఇస్తుందని వాటిని ఉపయోగించుకొని పిల్లలను బాగా చదువించుకోవాలన్నారు. చర్చిల లో పార్థనాల చేస్తున్న పాస్టర్ లకు నెల కు రూ.5 వేలు ఆర్థికం అందజేస్తుందని తెలిపారు. జగనన్న గృహ నిర్మాణం పథకం ద్వారా అర్హులందరికీ ఇల్లు పట్టాలు ఇవ్వడం జరిగిందని ఇంకా అర్హులు ఉంటే వారికి కూడా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ భూములలో వ్యవసాయం చేసుకుంటున్న వారికి అసైన్మెంట్ కమిటీ లో పెట్టి పట్టాలు మంజూరు చేసి అందజేయడం జరుగుతుందన్నారు. మైనార్టీ, క్రిస్టియన్ ల భువనం, స్మశాన వాటిక గృహలు మంజూరు చేయాలని కార్యక్రమంలో కోరారని దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్,మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని సూచించారు.

యస్వీయూలో ఏపి పిజి, ఏపి ఐసెట్స్-2023 స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి - క్యాంపస్ :

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో స్పాట్ అడ్మిషన్ల ద్వారా పిజి (ఎంఏ, ఎంయస్సీ, ఎంకాం) ఐ సెట్ (యంబిఏ, ఎంసిఏ)లో అడ్మిషన్లకు ఉన్నత విద్యామండలి మరో అవకాశం కల్పించినట్లు డివోఏ డైరెక్టర్ ఆచార్య మురళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యస్వీయూలోని వివిధ కళాశాలల్లో కొన్ని శాఖల్లో వున్న ఖాళీ సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తామని తెలిపారు. ఈనెల 23 న ఖాళీలను వెబ్‌సైటులో చూడవచ్చని, ఈ నెల 26వ తేదీ నుండి 29వ తేదీ లోపు పీజీ సెట్ సర్టిఫికేట్ వెరిఫికేషన్, స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. 26, 27వ తేదీల్లో ఐసెట్ సర్టిఫికేషన్ వెరిఫికేషన్, స్పాట్ అడ్మిషన్స్ జరుగుతాయని డివోఏ డైరెక్టర్ తెలిపారు. మరిన్ని వివరాలను ఖాళీలను ఎస్వి యూనివర్సిటీ.ఇడియు.ఇన్/ డివోఏ/ వెబ్ సైట్ ద్వారా పొందవచ్చున్నారు.

ఆరోగ్యశ్రీ కార్డు పరిధి రూ.25 లక్షలకు పెంపు

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ :

ఆరోగ్యశ్రీ కార్డు పరిధి రూ.25 లక్షలకు పెంచారని వైసిపి నాయకులు పేర్కొన్నారు. మండలంలోని పాలకొండ సత్రం పంచాయతీ సచివాలయ పరిధిలో ఆ గ్రామ సర్పంచ్ అధ్యక్షతన మండల పరిషత్ ఇన్చార్జి అధికారిని వంట విజయలక్ష్మి శుక్రవారం ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ లో వైసీపీ మండల కన్వీనర్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదల పాలిట పక్షిపాతి ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడమే కాక వారి ఆరోగ్యం దృష్ట్యా మెరుగైన సేవల కల్పనకు ఆరోగ్యశ్రీని కార్డు ద్వారా 25 లక్షలు వరకు వైద్యం చేయించుకోవచ్చని ఇది పేద ప్రజలకు ఓ వరమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు శివారెడ్డి, తిరుమల, రాజేంద్ర, వైద్య అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేరువ కావాలి

టిఎన్ఎస్ఎఫ్ నాయకులకు లోకేష్ సూచన

ప్రజాశక్తి - క్యాంపస్, తిరుపతి(మంగళం):

టిఎన్ఎస్ఎఫ్ నాయకులు విద్యార్థులకు చేరువ కావా లని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు సూచించారు. యువగళం పాదయాత్ర ముగింపు సందర్భంగా తిరుపతి జిల్లా టిఎన్ఎస్ ఎఫ్ అధ్యక్షులు కొట్టే హేమంత్ మర్యాద పూర్వకంగా లోకేష్‌ను కలిసి శ్రీవారి ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో లోకేష్ మాట్లాడుతూ విద్యార్థుల జీవి తాలతో చెలగాటం ఆడుతున్న రాష్ట్ర ప్రభుత్వం పై ఉద్యమించాలని ప్రతి విద్యార్థిని మెలుకొలపాలని రాక్షస ప్రభుత్వం తీసుకున్న విద్యా వ్యతిరేక నిర్ణయాలను టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పడ్డాక రద్దు చేస్తామని చెప్పారన్నారు. ప్రతి విద్యార్థులు టిడిపికి ఓటు వేసేలా చైతన్య పరచాలని సూచించారు.

మద్యం అక్రమ రవాణా వాహనం జప్తు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

కర్ణాటక మద్యం అక్రమంగా రవాణా చేస్తూ శ్రీకాళహస్తి సెబ్ అధికారులకు పట్టుబడ్డ ఓ వాహనాన్ని శుక్రవారం ఆ శాఖాధికారులు జప్తు చేశారు. శ్రీకాళహస్తి సెబ్ సీఐ శ్రీనివాస రెడ్డి కథనం మేరకు.. 2021 నవంబరు 10వ తేదీన శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గం బైరాజులకండ్రిగ వద్ద కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న హుండాయ్ శాంట్రో కారును శ్రీకాళహస్తి సెబ్ అధికారులు పట్టుకున్నారు. అయితే ఆ కారు యజమాని ఇచ్చిన గడువులోపు సరైన ఆధారాలు చూపకపోవడంతో జప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సెబ్ అధికారుల దాడుల్లో పట్టుపడ్డ వాహనాలకు ఆయా వాహనాల యజమానులు వారం రోజుల్లోపు సరైన ఆధారాలు చూపుకుంటే జప్తు చేసే అధికారం సెబ్ కు ఉంటుందని స్పష్టం చేశారు.

నేషనల్ కన్జ్యూమర్ సెలబ్రేషన్స్ పోటీల్లో

ఏర్పేడు విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - ఏర్పేడు:

ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామానికి చెందిన కె. ధాత్రి శ్రీకాళహస్తి కాసా గార్డెన్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. మంగళవారం నిర్వహించిన నేషనల్ కన్జ్యూమర్ 2023 సెలబ్రేషన్స్ కాంపిటీటివ్ పోటీల్లో జిల్లా స్థాయిలో తృతీయ బహుమతిని గెలుపొందింది. బహుమతి పొందిన ధాత్రిని కాలేజీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పలువురు ప్రశంసించారు. ధాత్రి మేర్లపాక సర్పంచ్ కే గంగాధర్ కుమార్తె కావడం విశేషం. మేర్లపాక గ్రామస్తులు అందరూ గ్రామం కీర్తిని జిల్లా స్థాయిలో తెచ్చిందని అభినంద నలు తెలిపారు.

జగనన్న పాలనలో విద్యార్థులకు అవకాశాలు మెండు : రోజా

నగరిలో

బంగారుపాళ్యంలో



వికోటలో

ప్రజాశక్తి-నగరి: జగనన్న పాలన విద్యార్థులకు సువర్ణ కాలం అని మంత్రి ఆర్కేరోజా అన్నారు. శుక్రవారం మండలంలోని తడుకుపేట జెడ్పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. 8వ తరగతి విద్యార్థులు 43 మందికి ట్యాబ్‌లను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం, జడ్పీటీసీ సభ్యులు గాంధీ, ఎంపీపీ భార్గవి, వైస్‌ఎంపీపీ కన్నియప్ప, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికోట: రాష్ట్రంలోని అన్ని వర్గాల పేద ప్రజల అభివృద్ధి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమవుతుందని చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని పట్రపల్లి, ఖాజీపేట జెడ్పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం 8వ తరగతి విద్యార్థులకు ఉచిత ట్యాబ్‌లు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తమీంఖాన్, వికోట ఉపసర్పంచ్ అక్మల్, దేవరాజు నాయుడు, ఎంఈఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మారుమూల ప్రాంతాలకు ట్యాబులు ద్వారా సాంకేతిక విద్య అందించేందుకు ఉపయోగపడుతుందని వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలీశ్వర అన్నారు. శుక్రవారం మండలంలోని బోడబండ్ల జెడ్పి ఉన్నత పాఠశాలలో ట్యాబులు పంపిణీ కార్యక్రమం హెచ్ఎం నిర్మల ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ హరి, ఉపాధ్యాయులు రమేష్, స్వామి వెల్, గుణశేఖర్, బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

సోమలలో

ప్రజాశక్తి-సోమల:

వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సోమల మండలం ఇరికిపెంట సచివాలయం వద్ద శుక్రవారం 35 మందికి కంటి అద్దాలను స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పంపిణీ చేశారు. సర్పంచి రెడ్డప్ప మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అని ఏనాడో పెద్దలు చెప్పినట్టు సీఎం జగన్మోహన్ రెడ్డి అవ్వ, తాతల కోసం కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తున్నారన్నారు. సిహెచ్ఓ అమర్నాథ్, ఏఎన్ఎం మదనిక, ఆశా కార్యకర్తలు గుణవతి, నాగరత్న, నాయకులు సుందర్‌రాజు, రాజారెడ్డి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: వైయస్సార్ కంటి వెలుగుతో అందరికీ వెలుగని ఎంఎల్‌హెచ్‌పి దిలీప్ అన్నారు. శుక్రవారం మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీలో వైయస్సార్ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి పరీక్షలు చేసుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త రోజా రమణి, ఆశా వర్కర్లు పుణ్యవతి, మునెమ్మ పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో

యువగళం ముగింపు కాదు.. నవశకం ప్రారంభం

- ఓటమి భయంతోనే వైకాపాలో ఎమ్మెల్యేల బదిలీ
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - గంగవరం:

యువగళం పాదయాత్ర ముగింపు కాదని ఇది ఒక నూతన నవ శకం ప్రారంభాన్ని సూచిస్తుందని మాజీ మంత్రి అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేర్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం నవశకం వేడుకకు లక్షలాది మంది జన సందోహం హాజరై అంచనాలను మించి విజయవంతం అయిందన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పొలిట్ బ్యూరో సభ్యులు నందమూరి బాలకృష్ణలను ఒకే వేదికపై చూసిన తర్వాత వైసీపీలో ఓటమి భయం మొదలైందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమిని ముందే ఊహించిన జగన్ రెడ్డి ఎమ్మెల్యేలను బదిలీ చేసే పనిలో పడ్డారని ఓటమి భయంతోనే ఎమ్మెల్యేలను బదిలీ చేసి కొత్త ముఖాలను ప్రవేశపెట్టి మళ్లీ మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు.

నిరాశ్రయులను ఆదుకోవాలి : మేయర్

దుప్పట్లు పంపిణీ చేస్తున్న మేయర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని చిత్తూరు నగర పలక సంస్థ మేయర్ అముద అన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థ మెప్మా సహకారంతో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో క్రిస్మస్ ముందస్తు సంబరాల్లో భాగంగా కేక్ కట్ చేసి దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆ సంస్థ అధ్యక్షులు జోసఫ్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మేయర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సపోర్ట్ సంస్థ సిబ్బంది ప్రమీల, సురేష్ పాల్గొన్నారు.

మామిడిలో అధునాతన పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మామిడి పంట దిగుబడికి అధునాతన పద్ధతులు పాటించాలని డేటా సెంటర్ శాస్త్రవేత్త రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని మార్కెట్ యార్డ్ నందు ఉద్యానవన శాఖ అధికారి లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో మామిడి పూత, పిందె దశలో చేపట్టవలసిన సస్య రక్షణపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రాఘవేంద్ర రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.రామచంద్రారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, మామిడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

'సీఎం జగన్‌తోనే అన్ని వర్గాలకు సంక్షేమం'



ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీపీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కడపనత్తం సచివాలయం పరిధిలో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డప్ప పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక చేసిన అభివృద్ధి పనులను, అందించిన లబ్దిని వివరించారు. కార్యక్రమంలో జడ్పిటిసి కేశవులు. పంచాయతీ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ కార్తిక్ లక్ష్మీనారాయన, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.